
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
శుక్రవారం 25 అక్టోబరు 2024

సమాచారం

నేడు కొత్తగూడలో సీతక్క పర్యటన



కొత్తగూడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కొత్తగూడ మండలంలో శుక్రవారం పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క పర్యటిస్తున్నట్టు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పొగుళ్లపల్లి, ఎదుళ్లపల్లి పాఠశాలలో నిర్వహించే కార్యక్రమాల్లో మంత్రి పాల్గొంటారని, పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని సీతక్క పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



డీటీవోగా భద్రునాయక్

బాధ్యతల స్వీకరణ

నెహ్రూ సెంటర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా రవాణా శాఖ అధికారి (డీటీవో)గా బానోత్ భద్రునాయక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గత రెండునెలల క్రితం మానుకోట జిల్లా డీటీవోగా పని చేసిన ఎమ్డీ. గౌస్‌పై ఏసీబీ దాడులు నిర్వహించి, విధుల నుంచి తొలగించడంతో అప్పటి నుంచి ఇన్‌చార్జి డీటీవోగా వరంగల్ అధికారి జైపాల్‌రెడ్డికి అప్పగించారు. కాగా, మహబూబాబాద్ జిల్లా డీటీవోగా భద్రునాయక్ బదిలీపై వచ్చి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కాగా, గతంలో కూడా జిల్లా డీటీవోగా పని చేశారు.



మీడియాకు వివరాలను వెల్లడిస్తున్న ములుగు డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్

ఒక ముఠా.. నాలుగు జిల్లాలు

6

- 500కుపైగా నకిలీ పాస్ పుస్తకాల విక్రయం
- బ్యాంకు రుణాలు, రైతు భరోసా వస్తుందని ఆశచూపి మోసం
- ములుగు, భూపాలపల్లి, వరంగల్, మహబూబాబాద్‌లలో దందా
- పోలీసు, అటవీశాఖ అధికారుల దర్యాప్తులో తేలిన నిజం
- ప్రధాన సూత్రధారి సహా నలుగురి అరెస్టు
- వివరాలు వెల్లడించిన డీఎఫ్‌వో రాహుల్‌కిషన్ జాదవ్



మానుకోట వ్యవసాయ మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన పత్తి

తాత్సారం

పత్తి సీసీఐ కొనుగోళ్లు మరింత ఆలస్యం

- దీపావళి తర్వాత సేకరించే అవకాశం?
- అధిక తేమ శాతమే అడ్డంకి
- మార్కెట్‌లలో మద్దతు ధర లేక నష్టపోతున్న రైతులు
- ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్న కర్షకులు

మహబూబాబాద్ అగ్రికల్చర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రభుత్వ మద్దతు ధరకు పత్తి కొనుగోళ్లు చేపట్టడం ఆలస్యమవుతున్నాయి. అలాగే సీసీఐ పత్తి కొనుగోళ్ల ప్రారంభం కాలేదు. పత్తిలో తేమ శాతం అధికంగా ఉంటుండడంతో సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) కొనుగోళ్లలో తాత్సారం చేస్తోంది. ఫలితంగా రైతులు వ్యవసాయ మార్కెట్లలో పత్తిని తీసుకుని వెళ్తే ప్రభుత్వ మద్దతు ధర లభించడం లేదు. మద్దతు ధర కంటే తక్కువగా క్వింటాపై రూ.600 నుంచి రూ.700 వరకు తక్కువ ధర పెట్టి కొనుగోళ్లు చేపడుతున్నారు. దాంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మహబూబాబాద్ జిల్లాలో సీసీఐ కొనుగోళ్లను ఆరు జిన్నింగ్ మిల్లులో చేపట్టడానికి సిద్ధంగా ఉన్నారు. తేమశాతం అధికంగా ఉండడంతో పత్తి కొనుగోళ్లకు వెనుకాడుతున్నారు.

ఆరు జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోళ్లు..

మహబూబాబాద్ జిల్లాలో ఆరు జిన్నింగ్ కాటన్ మిల్లుల్లో మార్కెట్ అధికారుల నేతృత్వంలో సీసీఐ కొనుగోళ్లు చేపట్టనున్నారు. మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో ఒక జిన్నింగ్ మిల్లు, కేసముద్రం మార్కెట్ పరిధిలో కేసముద్రంలో రెండు, మరిపెడలో ఒకటి, తొర్రూరు మార్కెట్‌ల పరిధిలో రెండుమిల్లులకు జిల్లా యంత్రాంగం నుంచి అనుమతి లభించింది. గతేడాది ఆరు మిల్లుల్లో 11,817 మంది రైతుల నుంచి 2,48,782 క్వింటాళ్ల పత్తిని ఖరీదు చేశారు. ఇందులో ఒక కేసముద్రం మార్కెట్ పరిధిలో 6052 మంది రైతుల నుంచి 1,19,456 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు.

ఈ సారి పెరిగిన మద్దతు ధర

గత ఏడాది మద్దతు ధర క్వింటాకు రూ.7,020 ఉండగా, ఈ సారి రూ.7,521కి పెరిగింది. పత్తి పొడుగు గింజరకం 8 శాతం తేమలోపు ఉంటే రూ.7,521, తేమ 9 శాతం ఉంటే రూ.7,446, తేమ 10 శాతం ఉంటే రూ.7,371, తేమ 12 శాతం ఉంటే రూ.7220 ధర ప్రకటించింది.

ప్రైవేట్ వ్యాపారుల ఖరీదు..

జిల్లాలో సీసీఐ కొనుగోళ్లు లేకపోవడంతో మహబూబాబాద్, కేసముద్రం వ్యవసాయ మార్కెట్లలో పత్తికి క్వింటా రూ.7 వేల లోపే ఖరీదు చేపడుతున్నారు. కేసముద్రం మార్కెట్లలో గురువారం రూ.4,666 నుంచి రూ.6,906 వరకు ధరలు పలుకుతున్నాయి. అధికంగా రూ.6,500 నుంచి రూ.6,725 వరకు ప్రైవేట్‌వ్యాపారులు కొంటున్నారు. గత ఐదు రోజులుగా ధరలను పరిశీలిస్తే రూ.7,039 నుంచి రూ.6,906 వరకు ధరలు తగ్గుతూ వస్తున్నాయి. మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో పత్తి రూ.6,072 నుంచి రూ.6,968 ధరలు పలుకుతున్నాయి. ప్రభుత్వ మద్దతు ధరను

మిగతా 8లో..

పేదోళ్లందరికీ ఇందిరమ్మ ఇళ్లు

ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్



పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రాంచంద్రునాయక్

మరిపెడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పేదోళ్లందరికీ దీపావళి నుంచి రాష్ట్రప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయనున్నదని ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. గురువారం మరిపెడ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలల్లో ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. దేశంలోనే ఎక్కడలేని విధంగా తెలంగాణ రాష్ట్రప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల కరెంట్ బిల్లులు మాఫీ, రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. ప్రతీ పేదోడికి ఇళ్లు ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు వివరించారు. కార్యకర్తలు గ్రామాల్లో నిష్పక్షపాతంగా వ్యవహరించి అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు యుగేంధర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు రఘువీర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు తాజ్‌ద్దీన్, కాలం రవీందర్‌రెడ్డి, ఐలిమల్లు, అఫ్జల్, అఫ్సర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందచేశారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్

గూడూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో గెలవడానికి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాల హామీని వెంటనే అమలు చేయాలని మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు. గూడూరులో బుధవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ఉపవాస దీక్షల రెండోజు చేరుకున్నాయి. ఈ దీక్ష శిబిరాన్ని మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ సందర్శించి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా.. ఇచ్చిన హామీలను నేరవేర్చడంలో విఫలం చెందిందన్నారు. విద్య, వైద్యం ఉచితంగా అందించాలని పేర్కొన్నారు. వరికి బోనస్, రైతాంగానికి రైతుబంధు, కల్యాణలక్ష్మికి రూ.లక్షతో పాటు తులం బంగారం, మహిళలకు ప్రతినెల రూ.2500, వృద్ధులకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేల ఆసరా పించన్, మహిళ విద్యార్థినులకు స్కూటీలను అందించాలని డిమాండ్ చేశారు. ఉపవాస దీక్షల్లో కూర్చున్న వారిలో ఎండీ రహీం, భూక్య సురేష్‌నాయక్, బోడ ఎల్లయ్య, నూకల అశోక్, ఎండీహైమద్, నాగేంద్రబాబు, మైదం రాజుపటేల్, దోమ వెంకన్న, చీదురు అనిల్, బానోత్ విజయ్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వేం వెంకటకృష్ణారెడ్డి, మండల అధికార ప్రతినిధి బానోత్ నర్సింహానాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆరె వీరన్న, కోడి రవి, సంపత్‌రావు, కటార్‌సింగ్, నూకల సురేందర్, చీదురు వెంకన్న, బోడ కిషన్, సంపంగి రాంచందర్, రాములు, ఎదునూరి వెంకన్న, ఎడ్ల రమేష్ పాల్గొన్నారు.



గూడూరు బీఆర్ఎస్ ఉపవాస దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్

'మహేష్ మృతి కేసును పక్కాగా దర్యాప్తు జరపాలి'

గార్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : సీతంపేటలో ఈనెల 20వ తేదీన అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన గుమ్మడి మహేష్ కేసు దర్యాప్తును పక్కాగా జరిపి, దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ గ్రామస్థులు, బంధువులు గురువారం ఆందోళన చేపట్టారు. ఈ కేసులోని ఇద్దరు అనుమానితులుగా గుర్తించి అరెస్టు చేయగా, వీరిని గార్ల, బయ్యారం సీఐ బి.రవికుమార్ ఘటన స్థలానికి తీసుక రాగా, గ్రామస్థులు, బంధువులు అనుమానితుల ఇంటిపై పడి హంగామా సృష్టించారు. దీంతో పరిస్థితి అదుపు తప్పడంతో ఘటన స్థలానికి ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కైకెన్ చేరుకొని మహేష్ మృతిపై ఆరా తీశారు. మహేష్ మృతి చెంది నాలుగు రోజులు కావస్తున్నా అనుమానితులు గ్రామంలో యథేచ్ఛగా తిరుగుతున్నారని, సీఐ రవికుమార్ కేసును నీరుగార్చే విధంగా వ్యవరిస్తున్నారని బంధువులు ఆరోపించారు. దీంతో ఎస్పీ స్పందిస్తూ దోషులు ఎంతటివారైనా వదిలిపెట్టే ప్రసక్తేలేదని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు. గార్ల, బయ్యారం డోర్నకల్, మహబూబాబాద్ సీఐలతో పాటు పోలీసులు భారీ బందోబస్తును నిర్వహించారు.



మహేష్ మృతికి కారకులైన నింధితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

కాజీపేట జంక్షన్‌ను రైల్వే డివిజన్‌గా అప్‌గ్రేడ్ చేయాలి

- నష్కల్ బైపాస్ లైన్‌పై పునరాలోచించాలి
- రైళ్ల హాల్టింగ్, ఇజ్జత్ పాస్‌లను పునరుద్ధరించాలి
- కేంద్రమంత్రి, రైల్వే జీఎం సమావేశంలో వరంగల్, మానుకోట ఎంపీలు కావ్య, బలరాంనాయక్



మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ కడియం కావ్య, పక్కన మహబూబాబాద్, ఖమ్మం ఎంపీలు బలరాంనాయక్, రఘురామ్‌రెడ్డి

6

తహసీల్దార్‌ను దూషించిన వ్యక్తిపై కేసు నమోదు

నెల్లికుదురు, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి) : తహసీల్దార్‌ను దూషించిన ఘటనలో జెల్ల యాకయ్యపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఇసుక ట్రాకర్లను ఆపడానికి ఆకేరువాగులోకి వెళ్లిన తహసీల్దార్ రాజును బ్రాహ్మణ కొత్తపల్లి చెందిన జెల్ల యాకయ్య అసభ్య పదజాలంతో దూషించిన ఘటన నెల్లికుదురు మండలంలోని ఆకేరువాగులో బధవారం రాత్రి జరిగింది. దీంతో రెవెన్యూ అధికారులపై ఇసుక మాఫియా దౌర్జన్యాలు ఆపాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు సిబ్బంది గురువారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బుధవారం రాత్రి ఆకేరువాగులో ఇసుక ట్రాక్టర్లను పట్టుకోవడానికి రెవెన్యూ సిబ్బందితో వెళ్లామని, బ్రాహ్మణకొత్తపల్లికి చెందిన జెల్ల యాకయ్య తన అనుచరులతో కలిసి తమపై అసభ్యపదజాలంతో దూషించాడని, దౌర్జన్యం చేశాడన్నారు. వెంటనే పోలీస్‌లకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకొని యాకయ్యపై కేసు నమోదు చేశారన్నారు. రోజురోజుకు ఇసుక మాఫియా దౌర్జన్యాలు పెరుగిపోతున్నాయని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నయాబ్ తహసీల్దార్ తరంగిణి, గిర్దావర్ రహమాన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న రెవెన్యూ అధికారులు

క్రికెట్‌లో జాతీయస్థాయిలో గుర్తింపు తేవాలి

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అజయ్‌సారథిరెడ్డి



మానుకోట క్రికెట్ టీమ్‌ను అభినందిస్తున్న జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అజయ్‌సారథిరెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాకు క్రికెట్‌లో జాతీయస్థాయిలో గుర్తింపు తేవాలని క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అజయ్‌సారథిరెడ్డి అన్నారు. వరంగల్‌లో ఈనెల 20వ తేదీ నుంచి 23 వరకు ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంట్రా అండర్ 23 క్రికెట్ టోర్నమెంట్‌లో రన్నరప్‌గా నిలిచిన మానుకోట జిల్లా జట్టును గురువారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన

మిగతా 8లో..

సంఘటితమైతేనే సమస్యలకు పరిష్కారం

ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

నర్సింహులపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు సంఘటితమై ఐక్యంగా ఉద్యమిస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయని వరంగల్, ఖమ్మం, నల్గొండ శాసన మండలి సభ్యుడు అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. గురువారం నర్సింహులపేట మోడల్ స్కూల్, జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రపన్నుతున్నాయని ఆరోపించారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యూలర్ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నట్లు గుర్తు చేశారు. వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరంగల్, ఖమ్మం, నల్గొండ స్థానం నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా మరోసారి పోటీలో ఉంటున్నానని ఉపాధ్యాయులుగెలి పించాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు కార్యదర్శి నవీన్, నాగమల్లయ్య, యాకయ్య చైతన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఏఎల్‌వో కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలి'

కేసముద్రం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ (ఏఎల్‌వో) కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ పూలే సెంటర్‌లో గురువారం సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి గొడిశాల వెంకన్న మాట్లాడారు. పారిశ్రామిక కేంద్రం గా ఉన్న కేసముద్రం ప్రాంతంలో వేలాదిమంది కార్మికులు ఉన్నారని తెలిపారు. 35 కిలోమీటర్ల దూరంలోని తొర్రూరు ఏఎల్‌వో కార్యాలయానికి వెళ్లేందుకు కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే ఈ కార్యాలయాన్ని కేసముద్రంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు మోడెం వెంకటేశ్వర్లు, చాగంటి కిషన్, బొబ్బాల యాకూబ్‌రెడ్డి, తాడబోయిన శ్రీశైలం, అల్లు గొండ సావిత్ర, నీరుటి జలేందర్, జల్లె జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న నలుగురి అరెస్టు

వెంకటాపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం నుంచి వెంకటాపురం మండలకేంద్రానికి గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు స్థానిక సీఐ బండారి కుమార్ తెలిపారు. ఈమేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. అందిన సమాచారం మేరకు మండలంలోని మరికాల గ్రామానికి వెళ్లేదారిలో పాలెం ప్రాజెక్టు పాత క్వార్టర్స్ సమీపంలో సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహించగా పోలీసులను చూసి నిందితులు పారిపోయేందుకు ప్రయత్నించారని, ఇందులో ఒకరు తప్పించుకోగా నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. దీంతో వారిని విచారించగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం మండలం భూపతిరావుకాలనీకి చెందిన తోకల దుర్గాప్రసాద్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లా చూచిరేవులగూడెంకు చెందిన సంఖ్య ప్రశాంత్‌కుమార్, ములుగు జిల్లా వెంకటాపురం మండలం రంగరాజపురం గ్రామానికి చెందిన గుండమల్ల రోహిత్, నేలవారిపేట గ్రామానికి చెందిన కుర్సం నీలమణికంఠగా పేర్కొన్నట్లు తెలిపారు. వారివద్ద నుంచి రూ.లక్షా27,750ల విలువచేసే ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

నీటి గుంతలో పడి మేకల కాపరి మృతి

గార్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని తిర్లాపురం కొత్తతండాకు చెందిన వాంకుడోత్ రామన్న కంసలితండా సమీపంలో నీటిగుంటలో పడి మృతి చెందిన ఘటన గురువారం జరిగింది. గ్రామస్థులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తిర్లాపురం కొత్తతండాకు చెందిన రామన్న (27) మేకలను మేపడానికి తోటి కాపరుడుతో కలిసి కంసలితండా సమీపంలోకి పోయాడు. నీటిగుంటలో మేకలకు నీళ్ల పెట్టడానికి వెళ్లిన రామన్న ఇంకా రాకపోవడంతో తోటి కాపరుడు సమీపంలో గాలించగా నీటిగుంటలో తెలియాడుతూ కనిపించాడు. దీంతో సదరు వ్యక్తి కుటుంబసభ్యులకు చరవాణిలో సమాచారం అందించాడు. ఘటన స్థలానికి గార్ల ఎస్సై జీనత్‌కుమార్ చేరుకొని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసున్నామని ఎస్సై తెలిపారు.

బావిలో పడి వ్యక్తి..

చిన్నగూడూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం శివారు రామచంద్రుతండాకు చెం దిన భూక్య లాలు (65) ప్రమాదవశాత్తు గురువారం బావిలో పడి మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. నర్సింహ అనే రైతువద్ద పామ్ ఆయిల్ తోటలో 9 ఏళ్లగా పని చేస్తున్నాడని, ఆరోగ్యం సహకరించకపోయినా రోజులానే పనికి వెళ్లి బావిలో నీరు తాగుతున్న క్రమంలో ప్రమాదవ శాత్తు అందులోపడి మృతి చెందినట్లు తెలిపారు. కాగా, మూడు మోటార్లు ఏర్పాటు చేసి బావిలో నీరులేకుండా చేసి మృతదేహం వెలికి తీతకు ప్రయత్నం చేస్తున్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఝాన్సీ తెలిపారు.

'ఏసీబీ'తో కలవరం

● భూపాలపల్లి కలెక్టరేట్ పీఆర్ విభాగంలో దాడులు ● లంచం తీసుకుంటూ పట్టుపడ్డ ముగ్గురు ఉద్యోగులు
● కాంట్రాక్టర్ నుంచి రూ.20వేలు డిమాండ్ ● రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కిన పీఆర్ ఈఈ, ఏటీవో, సీనియర్ అసిస్టెంట్
● వివరాలు వెల్లడించిన ఏసీబీ డీఎస్పీ సాంబయ్య



వివరాలు వెల్లడిస్తున్న వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య

భూపాలపల్లి కృష్ణకాలనీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి కలెక్టరేట్ సముదాయంలోని పంచాయతీరాజ్ శాఖ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఏసీబీ దాడులు కలకలం రేపాయి. ఓ కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటూ ఇంజనీరింగ్ అధికారితోపాటు మరో ఇద్దరు ఉద్యోగులు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోవడం చర్చనీయాంశమైంది. డ్యూటీలు దిగే సమయంలో ఏసీబీ అధికారులు ఒక్కసారిగా దాడులు నిర్వహించడంతో కార్యాలయ సిబ్బంది అవాక్కయ్యారు. ఏసీబీ వరంగల్ డీఎస్పీ సాంబయ్య నేతృత్వంలో ఈ దాడులు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన వివరాలు వెల్లడించారు.

భూపాలపల్లి జిల్లా పరిధిలోని మల్హర్ మండలం తాడిచర్ల గ్రామానికి చెందిన కుంట సదానందం అనే వ్యక్తి ఇదే గ్రామంలో వార్డు మెంబర్‌గా కొనసాగుతున్నాడు. కాంట్రాక్టర్‌గా కూడా ఆయన పని చేస్తున్నాడు. డీఎంఎఫ్‌టీ నిధుల ద్వారా రూ.10లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేశాడు. మొత్తం బిల్లులో రూ. 5లక్షల 83 వేలు ఇప్పటికే ఆయన అందగా మిగిలిన రూ.4 లక్షల 17 వేలు పెండింగ్‌లో ఉన్నాయి. దీని కోసం ఏఈ ఇన్‌బుక్ రికార్డు చేసి ఈఈకు ఫైలు పంపించారు. అయితే.. ఈ ఫైల్ స్క్రుటీని చేసి పాస్ ఆర్డర్ ఇచ్చేందుకు ఈఈ సంపతి దిలీప్‌కుమార్, అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్ (ఏటీవో) తహలాల చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ వల్లుపదాసు శోభారాణి ముగ్గురు కలిసి రూ.20వేలు డిమాండ్ చేశారు. అందుకు కాంట్రాక్టర్ సదానందం ఒప్పుకున్నాడు. అయినప్పటికీ వారు కాలయాపన చేసుకుంటూ వచ్చారు. ముందుగా డబ్బులు చెల్లిస్తేనే పని పూర్తి అవుతుందని అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్ చంద్రశేఖర్ కరాఖండిగా చెప్పారు. దీంతో లంచం ఇచ్చేందుకు ఇష్టంలేక ఏసీబీ అధికారులను కాంట్రాక్టర్ ఆశ్రయించాడు. పథకం ప్రకారం ముగ్గురికి కాంట్రాక్టర్ డబ్బులు ఇస్తుండగానే ఏసీబీ అధికారులు ఆకస్మికంగా దాడులు చేశారు. ఈఈ దిలీప్‌కుమార్, ఏటీవో చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ శోభారాణిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

గంటన్నరపాటు ఏసీబీ సోదాలు..

కలెక్టరేట్‌లోని రెండో అంతస్తులో ఉన్న పంచాయతీరాజ్‌శాఖ కార్యాలయంపై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి ముగ్గురిని అరెస్టు చేసిన క్రమంలో సుమారు గంటన్నర పాటు సోదాలు చేశారు. ఈఈ దిలీప్‌కుమార్, ఏటీవో చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ శోభారాణి పట్టుబడటంతో మిగిలిన సిబ్బందిపై కూడా ఆరా తీశారు. కార్యాలయంలోని అన్ని రికార్డులను పరిశీలించారు. ఫోన్‌పే, గూగుల్‌పే లావాదేవీలను కూడా నిశితంగా పరిశీలించారు. కార్యాలయంలోని అందరి వివరాలను అడిగి తెలుసుకొని నమోదు చేసుకున్నారు. ఏసీబీ రంగంలోకి దిగిన తదుపరి నుంచి వారి రైడ్ ముగిసేంత వరకు ఎవరినీ బయటకు అనుమతించలేదు. దాడుల్లో ఏసీబీ డీఎస్పీ సాంబయ్యతో పాటు సీఐలు శ్యాంసుందర్, ఎస్. రాజు, ఎల్. రాజు, మరో 11 మంది ఏసీబీ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు నెలలుగా తిరుగుతున్నా..

నేను చేసిన పనికి బిల్లులు చెల్లించాలని రెండు నెలలుగా కార్యాలయానికి తిరుగుతున్నా. అయినప్పటికీ అధికారులు పట్టించుకోకుండాకాలయాపన చేస్తూ వచ్చారు. రూ. 20వేలు ఇస్తేనే బిల్లులు వస్తాయని ఏటీవో చంద్రశేఖర్ చెప్పారు. ఈఈకి రూ.10వేలు, ఏటీవో చంద్రశేఖర్‌కు రూ.5వేలు, సీనియర్ అసిస్టెంట్ శోభారాణికి రూ.5వేలు చెల్లించాలని అన్నారు. బిల్లు వచ్చాక డబ్బులు ఇస్తానని చెప్పినా వినలేదు. ముందుగానే డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో విసుగు చెంది ఏసీబీ అధికారులను ఆశ్రయించా.

– కుంట సదానందం, బాధిత కాంట్రాక్టర్

లంచం తీసుకుంటే కఠిన చర్యలు

ప్రభుత్వ అధికారులు లంచం తీసుకోవద్దు. ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే మా టోల్‌ఫ్రీ 106 నంబరకు ఫోన్ చేయాలి. బాధిత కాంట్రాక్టర్ సదానందం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రైడ్ చేసి పంచాయతీరాజ్‌శాఖ ఈఈ దిలీప్‌కుమార్, ఏటీవో చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ శోభారాణిలను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నాం. వారిని వరంగల్ ఏసీబీ కోర్టుకు తరలిస్తాం.

– సాంబయ్య, ఏసీబీ డీఎస్పీ

కాజీపేట జంక్షన్‌ను రైల్వే డివిజన్‌గా అప్‌గ్రేడ్ చేయాలి

● నష్కల్ బైపాస్ లైన్‌పై పునరాలోచించాలి
● రైళ్ల హాల్టింగ్, ఇజ్జత్ పాస్‌లను పునరుద్ధరించాలి
● కేంద్రమంత్రి, రైల్వే జీఎం సమావేశంలో
వరంగల్, మానుకోట ఎంపీలు కావ్య, బలరాం నాయక్



అరుణ్‌కుమార్‌జైన్‌కు వినతిపత్రం అందజేస్తున్న బలరాంనాయక్

కాజీపేట / మహబూబాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట జంక్షన్‌ను డివిజన్‌గా అప్‌గ్రేడ్ చేయాలని, అందుకు రైల్వే మంత్రికి ప్రతిపాదనలు పంపాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య రైల్వే జీఎం ఏకే జైన్‌ను కోరారు. సికింద్రాబాద్ రైలు నిలయంలో గురువారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే జీఎం ఏకె జైన్‌తో తెలంగాణ, కర్ణాటక ఎంపీలతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా నుంచి వరంగల్, మహబూబాబాద్ ఎంపీలు కడియం కావ్య, పోరిక బలరాం నాయక్ పాల్గొని తమతమ పార్లమెంట్ పరిధుల్లో ఉన్న రైల్వే సమస్యలు, చేపట్టాల్సిన పనులపై రైల్వే జీఎం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎంపీ కడియం కావ్య.. మానుకోట, ఖమ్మం ఎంపీలు బలరాంనాయక్, రఘురామ్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. నష్కల్ నుంచి చింతల్‌పల్లి వరకు కొత్తగా చేపట్టనున్న బై పాస్ రైల్వే ట్రాక్ నిర్మాణంపై పునరాలోచించాలన్నారు. కొత్తలైన్ ప్రతిపాదనలపై స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులను సంప్రదించకుండా నిర్ణయం తీసుకున్నారనీ, దీంతో వ్యతిరేకత వస్తుందని తెలిపారు.

కాజీపేటలో రైల్వే ఆస్పత్రిలో సిబ్బంది కొరత ఉందని, పూర్తి స్థాయి సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరారు. ప్లాట్‌ఫారాల తక్కువ ఉండడంతో రైళ్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ప్లాట్‌ఫారాలను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. బస్టాండ్ లేకపోవడంతో ప్రయాణీకులకు తీవ్ర ఇబ్బందులు ఎదురౌతున్నాయని తెలిపారు. అందుకు స్థలం కేటాయించాలని కోరారు. ఆర్వోబీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. వ్యాగన్ పరిశ్రమను కోచ్‌ఫ్యాక్టరీగా అప్‌గ్రేడ్ చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలు వివరించిన బలరాంనాయక్

మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో పలు రైళ్ల హాల్టింగ్, ఇజ్జత్ పాస్‌లను వెంటనే పునరుద్ధరించాలని, రైల్వే సమస్యలను పరిష్కరించాలని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ కోరారు. మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో తిరువనంతపురం-రప్తిసాగర్, గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్, గ్రాండ్‌ట్రాంక్ ఎక్స్‌ప్రెస్, ఏపీ ఏసీ ఎక్స్‌ప్రెస్, వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. గతంలో కేసముద్రం రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ సౌకర్యం ఉన్న బీదర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, పద్మావతి ఎక్స్‌ప్రెస్ (అప్), కరీంనగర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, సాయినగర్ షిర్డీ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లకు పునరుద్ధరించాలని కోరారు. ముఖ్యంగా ఈ ప్రాంత ప్రజల అవసరాలకనుగుణంగా నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లకు కేసముద్రం స్టేషన్‌లో హాల్టింగ్ సౌకర్యం కల్పిస్తే హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉంటుందని చెప్పారు.

రద్దు చేసిన ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలని కోరారు. నెక్కొండ రైల్వేస్టేషన్‌లో ఇంటర్‌సిటీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, శాతవాహన ఎక్స్‌ప్రెస్, చార్మినార్ ఎక్స్‌ప్రెస్, నవజీవన్ ఎక్స్‌ప్రెస్, షిర్డీ ఎక్స్‌ప్రెస్, కరీంనగర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని బలరాంనాయక్ కోరారు. తాళ్ల పూసపల్లి వద్ద గేట్ నెంబర్ 79 ఎస్ నెంబర్ 428/10-12 వద్ద అండర్ పాస్ బ్యాలెన్స్ పనులు పూర్తి చేయాలన్నారు. డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో పద్మావతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, కోణార్క్ ఎక్స్‌ప్రెస్, నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టింగ్ కల్పించాలని కోరారు. మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో తాము ప్రతిపాదించిన అంశాలను పరిగణలోకి తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం సదరు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కు అందజేశారు. ఎంపీ వెంట కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి, కేసముద్రం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అల్లం నాగేశ్వర్‌రావు, జూలకంటి సీతారాంరెడ్డి ఉన్నారు.

కిట్లతోనే గీత కార్మికుల ప్రాణాలకు రక్షణ

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



పాలకుర్తిలో కాటమయ్య కిట్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

పాలకుర్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గీతకార్మికుల ప్రాణాలను రక్షించేందుకు ప్రభుత్వం కాటమయ్య రక్షక కిట్‌లను అందిస్తోందని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండలాల 200 మంది గీత కార్మికులకు కాటమయ్య కిట్లను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గీత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. జిలాలో 600 మందికి గీత కార్మికులకు ఈ కిట్లను పంపిణీ చేస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి రవీందర్, రవి, మూల వెంకటేశ్వర్లు, మొలుగూరి యాకయ్య తదితరులు ఉన్నారు.

● రబీ సీజన్‌లో సాగు చేసేందుకు అధికారులు ప్రణాళిలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సూచించారు. క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్ష చేశారు. పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్ల పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. సమావేశంలో ఈఈలు రమేష్‌బాబు, డీఈలు ప్రవీన్, శ్రీకాంత్‌శర్మ, సునిల్, పూర్ణచందర్, పీఆర్ డీఈ రామలింగాచారి, తహసీల్దార్ శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కుమారస్వామి, సురేష్, నల్ల శ్రీరామ్ ఉన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

తొర్రూరు (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. గురువారం తొర్రూరులోని క్యాంపు కార్యాలయంలోని ఆయాశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్ని గ్రామాల్లో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు స్థల కేటాయింపు, గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులైన వారందరికీ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. మునిసిపాలిటీ పరిధిలో డ్రైనేజీ, సీసీరోడ్ల నిర్మాణం, మునిసిపాలిటీ భవన నిర్మాణం తదితర పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు.

అభివృద్ధి పనులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెడుతుందని, అధికారులు దానికి అనుగుణంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో నర్సింహారావు, తహసీల్దార్ శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్ శాంతికుమార్, ఏఈ రంజిత్, కాంగ్రెస్ నాయకులుకె.నిరంజన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, బాపురెడ్డి, నెహ్రూనాయక్, చంద్రయ్య, విజయ్‌పాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఒక ముఠా.. నాలుగు జిల్లాలు

500కుపైగా నకిలీ పాస్ పుస్తకాల విక్రయం
బ్యాంకు రుణాలు, రైతు భరోసా వస్తుందని ఆశచూపి మోసం
ములుగు, భూపాలపల్లి, వరంగల్, మహబూబాబాద్‌లలో దందా
పోలీసు, అటవీశాఖ అధికారుల దర్యాప్తుతో కుట్ర భగ్నం
ప్రధాన సూత్రధారి సహా నలుగురి అరెస్టు

ములుగు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నాలుగు జిల్లాలు వేదికగా రైతు భరోసా, బ్యాంకు రుణాలను అడ్డదారిలో పొందేందుకు ఒక ముఠా చేసిన భారీ కుట్రను అటవీశాఖ అధికారులు భగ్నం చేశారు. నకిలీ ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాల తయారీపై జరిపిన దర్యాప్తులో ప్రధాన సూత్రధారి సహా నలుగురిని అరెస్టు చేశారు. ఈక్రమంలో నాలుగు జిల్లాల్లో ఇప్పటికే 500లకు పైగా ఫేక్ పట్టాలను విక్రయించినట్లు తేలడంతో విస్తుపోయారు. పూర్తిస్థాయి దర్యాప్తు జరపడం, నకిలీ పాస్‌పుస్తకాలను రికవరీ చేయడం ఆశాఖకు సవాల్‌గా మారింది. ములుగు డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్ జిల్లాకేంద్రంలోని అటవీశాఖ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన చందావత్ భద్రు, వరంగల్‌లోని ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకుడు తాటిపాముల రాజు, క్యూఆర్ కోడ్‌లు రూపొందించిన మహబూబాబాద్ జిల్లా నెక్కొండకు చెందిన కంప్యూటర్ సెంటర్ నిర్వాహకుడు భూక్యా వెంకన్న, ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం ఇంచెంచెర్వుపల్లికి చెందిన అటవీ హక్కుల కమిటీ చైర్మన్ జాటోతు రాజ్‌కుమార్‌లను అరెస్టు చూపించారు. వివరాలను వెల్లడించారు.

ములుగు, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లోని అటవీ గ్రామాలలో ఏజెంట్లను ఏర్పాటు చేసుకున్న చందావత్ భద్రు రైతు భరోసా, పంట రుణాలను ఆశచూపి అమాయక రైతులు, నిరు పేదల పాస్‌బుక్కుకు రూ.50వేల చొప్పున వసూలు చేశాడని తెలిపారు. రైతుల ఫొటోలు, ఆధార్ కార్డులు, ఇతర వివరాలను వాట్సప్ ద్వారా పంపిస్తే వరంగల్‌లోని గణేష్ ప్రింటర్స్‌లో దాని యజమాని రాజు ఫొటోషాప్, పేజ్ మేకర్ వంటి సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి పాస్‌బుక్కులను తయారుచేసి ముద్రించారని తెలిపారు. ఆయా జిల్లాలకు చెందిన కలెక్టర్‌లు, డీఎఫ్‌వోలు, ఐటీడీఏ పీవోల సంతకాలు, అక్షాంశ రేఖాంశాల వివరాలను ఒరిజినల్ పాస్‌పుస్తకాల నుంచి సేకరించి ఫేక్ పుస్తకాలపై ప్రింట్ చేశారని వివరించారు. దర్యాప్తులో భాగంగా ప్రింటింగ్ ప్రెస్‌ను తనిఖీచేయగా కంప్యూటర్‌లో నకిలీ పాస్‌పుస్తకాల వివరాలు లభ్యమయ్యాయని చెపారు. ఆ కంప్యూటర్‌ను సీజ్ చేశామని, హోలోగ్రామ్‌లు, నకిలీ సిఫారసు లెటర్లు తయారుచేసిన బానోతు హరికిషన్, ధారావత్ కిషన్, మధ్యవర్తులు పరారీలో ఉన్నారని, వారిని త్వరలోనే అరెస్టు చేస్తామని వెల్లడించారు.

నకిలీ పట్టాలతో ఆయా బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నట్లు తెలుస్తోందని, పోలీసుల సహకారంతో దర్యాప్తును ముమ్మరం చేశామన్నారు. ఇప్పటి వరకు తొమ్మిది నకిలీ పాస్ పుస్తకాలను రికవరీ చేశామని తెలిపారు. కాగా, పాస్‌పుస్తకాల విక్రయాలలో కోటిన్నరకు పైగా చేతులు మారినట్లు తెలుస్తోంది. దందాలో ఏజెంటుగా వ్యవహరించిన ములుగు మండలం ఖాసిందేవిపేటకు చెందిన చికెన్‌షాపు నిర్వాహకుడు వాంకుడోతు రవి ద్వారా సుమారు రూ.10లక్షలు వసూలుచేసి ప్రధాన సూత్రధారి భద్రుకు ఇచ్చినట్లు విచారణలో వెల్లడైంది. కాగా, ఈ మీడియా సమావేశంలో ములుగు రేంజ్ అధికారి డోలి శంకర్, డిప్యూటీ రేంజ్ అధికారి యాకుబ్‌బాషా, ఎఫ్‌బీవో శ్యాంసుందర్‌రెడ్డి, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రికవరీ ఎలా?

అటవీ భూములలో మూడు తరాలుగా పోడు వ్యవసాయం చేస్తున్న ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లోని గిరిజనులకు గత ప్రభుత్వం అటవీహక్కుల చట్టం-2006 కింద పట్టాలు జారీ చేసింది. అసలుకు ఏమాత్రం తీసిపోని విధంగా తయారుచేసిన నకిలీ పాస్‌పుస్తకాలు 500లకుపైగా ప్రజల చేతుల్లోకి వెళ్లిపోయాయి. వీటిని గుర్తించడం ఇప్పుడు అటవీశాఖకు సవాల్‌గా మారింది. ఆయా జిల్లాల అధికారులు ఇప్పటికే అప్రమత్తం కాగా ఫేక్ పట్టాలను రికవరీ చేయడంపై మల్లగుల్లాలు పడుతున్నారు. ఇదేక్రమంలో పంట రుణాల కోసం వెళ్లే అసలు పట్టాదారులను కూడా బ్యాంకర్లు అనుమానించే పరిస్థితి ఎదురైంది. నిజమైన పట్టాదారులు చాలామంది రైతుభరోసా కోసం గతంలోనే దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుత నకిలీ ఉదంతం మిగిలిన వారికి తలనొప్పిగా పరిణమించింది.



అదనపు ఎస్పీ సదానందంకు ప్రశంసాపత్రాన్నిస్తున్న ఎస్పీ శబరీశ్

పోలీసు అమరుల త్యాగాలకు వెలకట్టలేం..

మెగా రక్తదాన శిబిరంలో ములుగు ఎస్పీ

ములుగు కలెక్టరేట్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల త్యాగాలను వెలకట్టలేమని ఎస్పీ శబరీశ్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం పోలీసు హెడ్ క్వార్టర్‌లో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పోలీసు అమరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని వేరొకరి ప్రాణాలను కాపాడటంలో ముందడుగు వేస్తూ రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఆపదలో ఉన్న వారి ప్రాణాలను రక్షించడానికి రక్తం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం రక్తదానం చేసిన ఏఆర్ అదనపు ఎస్పీ సదానందం, ఆర్ఐ తిరుపతిరెడ్డి, పోలీస్ సిబ్బందికి ఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐ శంకర్, రిజర్వు ఇన్‌స్పెక్టర్ హోంగార్డ్స్ తిరుపతిరెడ్డి, రిజర్వు ఇన్‌స్పెక్టర్ సంతోష్, ములుగు ఎస్సై వెంకటేశ్వర్‌రావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌ను సన్మానించిన మానుకోట ఎస్పీ



కానిస్టేబుల్ అంజయ్యను సన్మానిస్తున్న సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి కొత్తగూడెం జోన్ మహబూబాబాద్ జిల్లా బీడీ టీమ్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ అంజయ్యను ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ గురువారం ఘనంగా సన్మానించారు. తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీలో ఈనెల 16వ తేదీ నుంచి 19 వరకు జరిగిన తెలంగాణ స్టేట్ ఫస్ట్ పోలీస్ డ్యూటీ మీట్‌లో అంజయ్యకు రూమ్‌సెర్చ్ గోల్డ్‌మెడల్ అందుకున్నారు. ఎవరైనా వీఐపీలు, వీవీఐపీలు ఒక ప్రదేశంకు వచ్చినప్పుడు వాళ్లు ఉండేరూమ్ ఎలాంటి అనుమానాస్పద వస్తువులు ఉండకుండా చూసుకునే విధానంలో తెలంగాణ రాష్ట్రం నుంచి ఏడు జోన్‌లు, ఐదు కమిషనరేట్స్ పాల్గొన్నాయి. ఇందులో మహబూబాబాద్ జిల్లాకు చెందిన కానిస్టేబుల్ అంజయ్యకు గోల్డ్ మెడల్ వరించింది. ఇందుకు గాను జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ కానిస్టేబుల్ అంజయ్యకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ట	క్వింటా కనిష్ట
మక్కలు (బిల్టీ రకం)	2530	2080
పల్లికాయ (సూక)	5800	5000
పల్లికాయ (పచ్చిది)	---	---
కందులు	7350	7000
పెసళ్లు	6200	4052
పత్తి	7000	5500
కొత్తపత్తి	---	---
పసుపు (కాడి)	12000	11000
పసుపు (గోల)	11600	11000
తేజ మిర్చి	12500	9000
తేజ ఏసీ	18000	12000
వండర్‌హాట్ ఏసీ	15500	11000
యూఎస్341ఏసీ	15000	11000
దేశీ ఏసీ	---	---
సింగిల్‌పట్టి ఏసీ	---	---
తాలు మిర్చి	8000	3000

- వరంగల్ వ్యవసాయం

సామాజిక అంశాలే ఇతివృత్తాలుగా..



- 'సీసీసీ' పేరుతో యూట్యూబ్ చానల్ ఏర్పాటు
- విభిన్న కథలతో ప్రజల్లోకి కొత్త, పాత తరం నటులు

లఘుచిత్రాలతో ఆలోచింపజేస్తున్న జనగామ కళాకారులు

కళ

జనగామ కల్చరల్, అక్టోబరు 24: సామాజిక అంశాలనే ఇతివృత్తాలుగా చేసుకొని తమ లఘుచిత్రాలతో ప్రజలను ఆలోచింపజేస్తున్నారు జనగామ కళాకారులు కవులు, కళాకారులకు నెలవైన.. పోరాటాలకు పురిటిగడ్డ, చైతన్యానికి మారుపేరు అయిన జనగామ ప్రాంతానికి చెందిన సామాజిక వేత్త, ప్రముఖ వైద్యుడు, రిటైర్డ్ కల్నల్ డాక్టర్ మాచర్ల భిక్షపతి ఆలోచనలకు ప్రజా కళాకారుడు, సామాజిక విమర్శకుడు, కవి జి.కృష్ణ పురుడు పోశారు. కల్చరల్ క్రియేటివ్ చానల్ (సీసీసీ) యూట్యూబ్ ఛానల్‌ను 2023 సెప్టెంబరులో ప్రారంభించారు. ఈ చానల్ ద్వారా ప్రముఖ కవి, కళాకారుడు అయిలా సోమనర్సింహాచారి, లగిశెట్టి ప్రభాకర్, చిలుమోజు సాయికిరణ్, పెట్లోజు సోమేశ్వరాచారి సహాయ సహకారాలతో అనేక కార్యక్రమాలు రూపొందించి ఆ చానల్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. 'రిటైర్డ్ కల్నల్ డాక్టర్ మాచర్ల భిక్షపతి', 'కలి అన్నం చేపల పులుసు' లఘుచిత్రంతో ప్రస్థానం మొదలైంది. దివంగత కవి జి.వై.గిరి రచించిన 'ఓ వయసు పోరగా' పాట, చిలుమోజు సాయికిరణ్ రాసిన 'మారాలి బహుజన పాట', జనగామ కవులు కళాకారులతో 'జనగామ కలం గళం' లాంటి పలు కార్యక్రమాలు ప్రేక్షకుల మనసులకు చేరువయ్యాయి. ఇటీవలి కాలంలో అందచందాలు, సౌందర్యం కన్నా గుణం ముఖ్యమంటూ తెలిపే సరదా సన్నివేశాలతో నటుడు కల్ల శ్రీనివాస్ రూపొందించిన 'ముదురు మొగుడు - ముద్దుల పెళ్లాం' లఘుచిత్రం ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉంది. అలాగే వృద్ధాప్యం ఒక శాపం కాదు, అది పెద్దలకు సేవ చేసుకునే భాగ్యంగా పిల్లలు భావించాలని, వృద్ధులైన తల్లిదండ్రులను ప్రేమతో ఆదరించాలనే గొప్ప సందేశాన్ని అందించే లగిశెట్టి ప్రభాకర్ రాసిన కథకు స్వీయ దర్శకత్వం వహించి 'తనదాక వస్తే' లఘుచిత్రం తక్కువ సమయంలో ఎక్కువ మంది ప్రేక్షకులకు చేరువైంది. అలాగే ఓటు ప్రాధాన్యత తెలిపి ఓటర్లను చైతన్యపరిచే ఇతివృత్తంతో కవి, కళాకారులు అయిలా సోమనర్సింహాచారి కథనం, దర్శకత్వంలో 'ఎవరు మారాలి' అనే లఘుచిత్రాన్ని జనగామ పరిసర ప్రాంతాలలో నిర్మించారు. పవర్ ఫుల్ మీడియా వెండి తెర, ప్రసార మాధ్యమాలు బుల్లితెర సరసన చేరిన యూట్యూబ్ చానల్‌లో సామాజిక అంశాలను కథావస్తువుగా చేసుకొని ఆలోచింపజేస్తున్న ఈ లఘుచిత్రాల వల్ల కొత్త, పాత తరం నటులు వెలుగులోకి వస్తున్నారు. కార్యక్రమాల నిర్వహణలో నటీనట, సాంకేతికవర్గం చిలుమోజు సాయికిరణ్, సేనాపత్ దశరథ నాయక్, పన్నీరు విజయం, శ్రీకాంత్ నాయక్, యూట్యూబ్ ఫేం కల్ల శ్రీనివాస్, ప్రియాశర్మ, లత, కొట్టె శ్రీలత, దక్షిణామూర్తి, గొలుసుల ఎల్లయ్య సహకరిస్తున్నారు.

ఒక వేదిక ఏర్పాటు చేయాలనేదే సంకల్పం

డాక్టర్ మాచర్ల భిక్షపతి, రిటైర్డ్ కల్నల్



బమ్మెర పోతన, పాలకుర్తి, సోమనాథుడు, వాల్మీకి నడయాడిన నేల జనగామ. చుక్క సత్తయ్య, గడ్డం సమ్మయ్య, జీవై గిరి లాంటి ఎందరో కవి పుంగవులు జన్మించిన పోరాటాల పురిటిగడ్డ జనగామ. కళలు, సాహిత్య రంగాల్లో నిత్యం భాసిల్లుతున్న జనగామ కేంద్రంగా యూట్యూబ్ ఛానల్‌కు ఒక వేదిక ఏర్పాటు చేయాలనే బలమైన కోరిక ఉండేది. ఈ ఛానల్ ద్వారా ఆ ఆశ నెరవేరింది.

ప్రతిభ కలిగిన కళాకారులకు గుర్తింపు

అయిలా సోమనర్సింహాచారి, కళాకారుడు



ప్రస్తుతం సోషల్ మీడియా ప్రపంచంలో యూట్యూబ్ ద్వారా ఎందరో ఔత్సాహిక కళాకారులు తమ ప్రతిభ కనబరుస్తూ గుర్తింపు పొందుతున్నారు. తద్వారా టీవీ, సినిమా రంగాల్లో అవకాశాలు కూడా వస్తున్నాయి. ఔత్సాహికులకు ఇది ఒక మంచి వేదికగా నిలుస్తోంది. విభిన్నమైన ఇతివృత్తాలతో తీస్తున్న లఘుచిత్రాలను ప్రోత్సహిస్తున్న ప్రేక్షకులకు మా ధన్యవాదాలు.

కవులు, కళాకారులకు అవకాశాలు కల్పిస్తాం

జి.కృష్ణ, సామాజిక కళాకారుడు



జానపద కళలు, సాహిత్యం, సంస్కృతి, సంప్రదాయం, సామాజిక స్పృహ, ఆరోగ్యంపై ప్రజలను చైతన్యపరచడానికి కల్చరల్ క్రియేటివ్ ఛానెల్‌ను ప్రారంభించాం. ఆసక్తి కలిగిన కవులకు, కళాకారులకు అవకాశాలు కల్పిస్తాం. నిగూఢంగా దాగివున్న కళా నైపుణ్యాన్ని వెలికి తీయటానికి కృషి కొనసాగిస్తాం. సమాజాన్ని జాగృతం చేస్తాం.

ఓ వైపు టీచర్.. మరో వైపు స్టూడెంట్..

- ద్విపాత్రాభినయం చేస్తున్న సుమయ్య ఫిర్దోస్


ఫిర్దోస్‌ను సత్కరిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

ప్రతిభ

శంభునిపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినిగా ఉండగానే ఉపాధ్యాయురాలిగా మారింది. ఒకే ఆవరణలో ఒక వైపు స్టూడెంట్‌గా, మరోవైపు టీచర్‌గా ద్విపాత్రాభినయం చేస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. ఈ మేరకు ఉపాధ్యాయురాలిని కళాశాల అధ్యాపకులు సత్కరించారు. వివరాల్లోకి వెళితే.. వరంగల్ శంభునిపేటకు చెందిన ఎండి.మసూద్ అలీ - రెహానా బేగంల కూతురు సుమయ్య ఫిర్దోస్ స్థానిక రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ఎంపీసీఎస్ చివరి సంవత్సరం చదువుతోంది. అయితే ఆమె ఇంటర్ చేసిన తర్వాత డైట్ అభ్యసించింది. ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో ఉద్యోగం సాధించింది. శంభునిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోనే కొలువు సాధించింది. అయితే తాను చదివే ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఉద్యోగం సాధించిన ప్రభుత్వ పాఠశాల ఒకే ప్రాంగణంలో ఉండటం గమనార్హం.

సత్కారం

ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఎంపిక కావడంతో రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం సుమయ్య ఫిర్దోస్‌కు అభినందన సభ ఏర్పాటు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాస్‌తో పాటు అధ్యాపకులు ఈ సందర్భంగా ఆమెను ఘనంగా సత్కరించారు. పట్టుదలతో చదివితే ఏదైనా సాధించవచ్చని ప్రిన్సిపాల్ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసులు, స్టాఫ్ సెక్రెటరీ డాక్టర్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు డాక్టర్ పీఎల్ఎన్ మూర్తి, శ్రీధర్, భగీరథ్, రమేష్, చారి, సుస్మిత, శైలజ, డాక్టర్ రాజన్న, గీత, షరీఫ్ పాల్గొన్నారు.

వారి గానామృతానికి 60ఏళ్లు

- భక్తి భజనలతో అలరిస్తున్న శివరామకృష్ణ భజనమండలి
- నేటి తరంలోనూ భక్తిభావం పెంచేలా ప్రదర్శనలు


తిరుమలలో అఖండ హరినామ సంకీర్తన చేస్తున్న భజనమండలి సభ్యులు (ఫైల్)

ఆధ్యాత్మికం

బచ్చన్నపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : తమ భజనలు, భక్తి గానంతో ఆహూతులను భక్తిపారవశ్యంలో మునిగిపోయేలా చేయడం శివరామకృష్ణ భజనమండలి ప్రత్యేకం. అలాంటి వారి గానామృతానికి 60ఏళ్లు నిండాయి. దేవాలయాల్లో భజనల ఉనికి కరువైపోతున్న ప్రస్తుత రోజుల్లో జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కట్కూరు గ్రామానికి చెందిన శివరామకృష్ణ భజన మండలి సభ్యులు రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శనలిస్తూ హిందుత్వం, దైవచింతన, ఆధ్యాత్మికతకు ప్రాణం పోస్తున్నారు. 1964లో బెజుగాం నారాయణ నేతృత్వంలో ఈ భజన మండలిని స్థాపించగా.. తొలిరోజుల్లో సుమారు 350 మంది సభ్యులుగా ఉండేవారు. రానురాను సంఖ్య తగ్గినా.. ఉనికికి ఉపద్రవం రాకుండా చింతల బాలయ్య, ముగ్రోజు బుచ్చయాచారి నేతృత్వంలో కొత్త బృందాలు రూపుదిద్దుకున్నాయి. ఏటా తిరుమల తిరుపతి దేవస్థానం ఆహ్వానం మేరకు అఖండ హరినామ సంకీర్తనలో పాలుపంచుకుంటూ రోజంతా తమ గానామృతంతో భక్తులను మైమరపింపజేస్తారు. జగిత్యాల, విజయవాడ, సిద్దిపేట, జనగామ, యాదగిరిగుట్ట, వేములవాడ, బాసర తదితర పుణ్యక్షేత్రాలలో తమ భజనలతో ఓలలాడించారు. అనేక పోటీల్లో పాల్గొని పతకాలు, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు పొందారు. శివరామకృష్ణ భజనమండలిని జగిత్యాలకు చెందిన వేల్పుల పెద్ది రాజయ్య స్థాపించగా, దాని శాఖలు రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించాయి. బచ్చన్నపేట మండల కేంద్రంతో పాటు పోచన్నపేట, నారాయణపూర్, కొడవటూరు, కొన్నె, నాగిరెడ్డిపల్లి, గంగాపూర్ గ్రామాల్లో భజన భక్తమండళ్లు ఉండేవి. ప్రస్తుతం కట్కూరులో సుమారు 40 మందితో కొనసాగుతోంది. యువత, బాలురు, బాలికలను ఇందులో భాగస్వాముల్ని చేస్తూ భక్తి మార్గం వైపు నడిపిస్తున్నారు. ఈ నెల 20న వేములవాడలో శివరామకృష్ణ భజనమండలి 60వ వార్షికోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలో రాష్ట్రంలోని 250 భజన బృందాలు పాల్గొనగా, కట్కూరు బృందానికి ప్రత్యేక ప్రశంసలు దక్కాయి.

పూర్వజన్మ సుకృతంగా భావిస్తాం..

- చింతల బాలయ్య, గాయకుడు



ఆలయాల్లో భజనలు చేసి భగవంతుడిని మెప్పించి ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలనుకుంటాం. అందుకే రాత్రి వేళల్లో మా శివాలయంలో భజన కార్యక్రమాలు కొనసాగిస్తుంటాం. కొత్త వారిని ప్రోత్సహిస్తున్నాం. భక్తిభావం కలిగి ఉంటే యువత సన్మార్గంలో వెళతారని నమ్ముతాం. దైవాన్ని స్మరించుకునేందుకు ప్రతీ ఒక్కరు కొంత సమయం కేటాయించాలి. ఎన్ని పనులున్నా, మమ్మల్ని ఆహ్వానిస్తే అక్కడ భక్తిభావం పెంపొందించాలనే ఆలోచనతో వెళతుంటాం. ఆరు తరాలుగా కాపాడుకుంటూ వస్తున్నాం. మా తరువాతి తరం దీన్ని కొనసాగిస్తుందని ఆశిస్తున్నాం.


కట్కూరు శివరామకృష్ణ భజనమండలి సభ్యులు

వైద్య విద్యార్థులకు ప్రతిభాపాటవ పోటీలు

- ఈనెల 25న కేఎంసీలో ప్రారంభం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రామ్‌కుమార్ రెడ్డి

వరంగల్ మెడికల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): 'కాకతీయ రీసెర్చ్ ఇనిషియేటివ్ ఫర్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్నోవేషన్స్' పేరుతో ఈనెల 25, 26 తేదీల్లో వైద్య విద్యార్థుల కోసం పలు రకాల పోటీలు, కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్‌కుమార్ రెడ్డి తెలిపారు. కాకతీయ మెడికల్ కాలేజీ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ రామ్‌కుమార్ రెడ్డి కార్యక్రమ వివరాలను వెల్లడించారు. ఈనెల 25, 26 తేదీల్లో మెడికల్ ఎగ్జిబిషన్, ఈనెల 25న రూ.6లక్షల ప్రైజ్ మనీతో మెడ్ క్విజ్ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎస్ఆర్ఐ అల్యూమిని, కాకతీయ మెడికల్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల్లో 9రకాల పోటీలు ఉంటాయన్నారు. అదే విధంగా వైద్య విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండే పేపర్ ప్రజంటేషన్, పోస్టర్ ప్రజంటేషన్, సింపోజియంలను కూడా నిర్వహిస్తామన్నారు. ఈనెల 25న ఉదయం కాళోజీ నారాయణ రావు ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ కరుణాకర్‌రెడ్డి ఈ పోటీలను ప్రారంభిస్తారని చెప్పారు.

ఈ పోటీల కన్వీనర్ డాక్టర్ సుజిత్ ఆర్ పున్నం మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే కేఎంసీని అగ్రగామిగా నిలిపేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. వైద్య విద్యను పటిష్టం చేసే ఈ కార్యక్రమంలో దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన వెయ్యికిపైగా వైద్య విద్యార్థులు, వైద్యులు పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ సంధ్య, ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళి, ఐఎంఏ తెలంగాణ శాఖ అధ్యక్షుడు డాక్టర్ కాళీప్రసాద్, ఏపీపీఐ అధ్యక్షుడు సతీష్ పాల్గొంటారని వివరించారు.



మంచు కురిసే వేళలో..

శీతాకాలం ఆరంభమైంది. తెల్లవారుజాము సమయంలో దట్టమైన మంచు కురుస్తోంది. దాంతో జనం, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇదిలో ఇలా గురువారం ఉదయం భూపాలపల్లి పట్టణంలోని రహదారులను మంచుకమ్మేసింది. అయితే కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు (కేటీపీపీ) చిమ్నీల ద్వారా వస్తున్న దట్టమైన పొగకు మంచు తెరలు తోడై ఆ పరిసరాలన్నీ ఎదుటి వారు దగ్గరకు వచ్చే వరకు కనిపించనంతగా కమ్మేశాయి.

ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా



పత్తి రైతుకు సాంకేతిక సాయం

- యాప్‌లో కొనుగోలు కేంద్రాల సమాచారం



మద్దతు ధరకు పత్తి విక్రయించడంలో రైతులకు ఇబ్బంది పడకుండా మార్కెటింగ్‌శాఖ సమాచారాన్ని అందించేందుకు సాంకేతికతను అందుబాటులోకి తెచ్చింది. వాట్సాప్‌లో ప్రభుత్వ రంగ సంస్థ సీసీఐ కొనుగోలు విధానాన్ని ఎప్పటికప్పుడు తెలియజేసేలా చర్యలు తీసుకుంది. దీంతో సీసీఐ కేంద్రానికి వచ్చిన సమయంలో పత్తి ఖరీదు, డబ్బుల చెల్లింపు ఏ స్థాయిలో ఉందనే సమాచారం తెలియనుంది. మార్కెటింగ్ శాఖ తాజా చర్యలతో రైతులు సీసీఐ కేంద్రాలున్న జిన్నింగ్ మిల్లుల్లో విక్రయానికి నిరీక్షించే అవసరం ఉండదు. ఏ కేంద్రంలో ఎంత పత్తి ఉంది? అక్కడ పత్తిని విక్రయించేందుకు ఎంత సమయం పడుతుందనే వివరాలను రైతులు ముందుగా తెలుసుకునే అవకాశం ఉంటుంది. సీసీఐకి పత్తి విక్రయించే రైతులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ జేడీఎం ఉప్పుల శ్రీనివాస్ తెలిపారు.

సూచన

రైతులు ఏం చేయాలంటే..



- సీసీఐకి పత్తి విక్రయానికి సంబంధించిన సెల్ నంబర్ 88972 81111 ను సేవ్ చేసుకోవాలి.
- ఆ నంబర్ వాట్సాప్‌లో 'హెచ్ ఐ' అని టైప్ చేయాలి.
- వెంటనే వన్ సాఫ్ట్ సిస్టమ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో యాప్ ఓపెన్ అవుతుంది.
- ఇంగ్లీష్, హిందీ, తెలుగు భాషలు కనిపిస్తాయి.
- కావాల్సిన భాషను ఎంపిక చేసుకోవాలి.
- వెంటనే పత్తి విక్రయం, తక్‌పట్టి, కొనుగోలు కేంద్రంలో వేచి ఉండే సమయం వంటి వివరాలు కనిపిస్తాయి.
- రైతులు ఎన్ని ఎకరాల్లో సాగు చేశారు.. ఎన్ని క్వింటాళ్ల పత్తిని సీసీఐ కొనుగోలు చేయగలదు వంటి వివరాలు తెలుస్తాయి.

- వరంగల్ వ్యవసాయం (ఆంధ్రజ్యోతి):

పొలం బడి బాటన..

- కేసముద్రం మండలం ధర్మారం తండాలో 30ఏళ్లుగా అదే దారి
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

పట్టించుకోండి..



కేసముద్రం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : అది మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ధర్మారంతండాలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల. ప్రస్తుతం ఈ బడిలో 13 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలకు రోడ్డు లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు పొలంగట్టుపై నుంచే నడుచుకుంటూ వెళ్లాల్సిందే. 30ఏళ్ల క్రితం పొలాల మధ్యలో నిర్మించిన ఈ పాఠశాలకు నేటికీ దారిని ఏర్పాటు చేయలేదు. ఈ తండాలోని సీసీ రోడ్డు నుంచి సుమారు 25 మీటర్ల దూరం పొలాల మధ్యనుంచే వరం (గట్టు)పై నుంచి విద్యార్థులతోపాటు అదే పాఠశాలలో కొనసాగుతున్న అంగన్‌వాడీ చిన్నారులు, ఉపాధ్యాయులు కూడా నడుచుకుంటూ వెళుతున్నారు. ఈ గట్టుపై నుంచి వెళ్లే క్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పలుమార్లు జారి కిందపడిన ఘటనలున్నాయి. ఈ సమస్య గురించి కొన్నేళ్లుగా అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకునే వారేలేరని తండావాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

'ఎక్స్'లో ప్రశ్నించిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్

ఈ సమస్య గురించి జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ స్పందించారు. విద్యార్థులు పొలాల్లోంచి నడుచుకుంటూ వెళుతున్న వీడియోను పోస్టుచేస్తూ 'గిరిజన విద్యార్థులపై ఎందుకింత వివక్ష? పాఠశాల భవనాన్ని నిర్మించినప్పుడే రోడ్డుకు స్థలం ఎందుకు తీయలేదు? బడికి వెళ్లాలంటే మా గిరిజన విద్యార్థులు పొలం గట్టు నుంచే పోవాలా? బడికి బాట లేకపోతే గిరిజన విద్యార్థుల భవిష్యత్తుకు బాట లేనట్టే' అంటూ కామెంట్ చేశారు. ఇలా జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు చేసిన ఎక్స్ పోస్టు చర్చనీయాంశమైంది. అలాగే ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పాఠశాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

'ఐసెట్ నిధులు హాంఫట్' కలకలం

- 'ఆంధ్రజ్యోతి' ప్రతులను పంచిన విద్యార్థులు
- విచారణకు సిద్ధమైన విద్యామండలి

కేయూ క్యాంపస్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): 'ఐసెట్ నిధుల హాంఫట్'పై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం కాకతీయ యూనివర్సిటీలో గురువారం కలకలం రేపింది. విద్యార్థులు ఆంధ్రజ్యోతి కథనాన్ని జిరాక్స్‌లు తీసి లైబ్రరీ, పరిపాలన భవనంతో పాటు వర్సిటీలోని మొదటి, రెండో గేటు ప్రాంతాల్లో పంచారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే ఐసెట్ నిధుల దుర్వినియోగంపై వర్సిటీలో తీవ్ర చర్చ నడుస్తోంది. అడ్డగోలుగా నిధులను దోచుకుతిని వర్సిటీ పరువుతీశారని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థిసంఘాల నేతలు ఇప్పటికే రాష్ట్ర ఉన్నతాధికారులకు, కేయూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి నిధులను స్వాహా చేసిన ప్రొఫెసర్లపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాగా, ఐసెట్ నిధుల గోల్‌మాల్‌పై రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆరా తీసినట్లు తెలిసింది. నిధుల దుర్వినియోగంపై వివరాలను వర్సిటీ ఉన్నతాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఒకటి, రెండు రోజుల్లో కమిటీ వేసి నిధుల వ్యయంపై సమగ్ర విచారణ జరుపుతారని అన్నట్లు సమాచారం.

స్థానిక సంస్థల ఎన్నికలకు సంసిద్ధం కావాలి

డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

నర్సింహులపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ కార్యకర్తలు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ రాం చంద్రునాయక్ పిలుపునిచ్చారు. నర్సింహులపేటలోని వెంకటేశ్వర గార్డెన్‌లో గురువారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. డోర్నకల్ నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా రూ.10కోట్లు తాగునీటి సమస్య పరిష్కారానికి, రూ.11 కోట్లు అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులకు రూ.10 కోట్లు, డోర్నకల్, మరిపెడ మునిసిపాలిటీలకు రూ.70 కోట్లు, పంచాయతీరాజ్ నుంచి రూ.30 కోట్లు, ఆర్అండ్‌బీ నుంచి రూ.10 కోట్లు చొప్పున రూ.140 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర నాయకులు అనిల్ కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు జినుకల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇర్రి లింగారెడ్డి, మరిపెడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజశేఖర్, వెన్నం రవీందర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ రజినీకాంత్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు బానోతు దస్రూ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు భిక్షం, గుగులోతు రాజేందర్, చిర్ర సతీష్, చంద్రారెడ్డి, మహబూబ్‌ఖాన్, తోట సురేష్, అన్నిగ్రామాల అధ్యక్షులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. అలాగే రైతు వేదికలో తహసీల్దార్ నాగరాజు పర్యవేక్షణలో రాంచంద్రునాయక్ లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అంజేశారు.

నట్టేట్ట ముంచిన కేసీఆర్..

దంతాలపల్లి : కొట్లాడి సాధించుకున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం నట్టేట ముంచారని డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అన్నారు. దంతాలపల్లిలోని రైతు వేదికలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందించారు. అనంతరం ఆయన మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొని విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. తర్వాత ఆయన శ్రీబాలాజీ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన మండల ముఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు.రానున్న పంచాయతీ ఎన్నికల్లో ఐక్యంగా ఉండి సర్పంచ్ అభ్యర్థులను గెలిపించాలన్నారు. జిల్లా సీనియర్ నాయకులు పొన్నోటి బాలాజీ, నవీన్‌రెడ్డి, తాజా మాజీ ఎంపీటీసీ సతీష్, యాకన్న, తాజా మాజీ సర్పంచులు రవీందర్, సంధ్య, నారాయణ, నాయకులు లింగారెడ్డి, పాష, రాంరెడ్డి, భద్రూనాయక్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాంచంద్రునాయక్

ఇంటర్వ్యూ

అక్రమ వ్యాపారాలపై నిఘా

తొర్రూరు ఎస్సై ఉపేందర్



ప్రశ్న : గంజాయి సేవించే వారిని ఎలా గుర్తిస్తున్నారు.

జవాబు : గంజాయి సేవించే వారిని గుర్తించడానికి టెస్టింగ్ కిట్లు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికే గతంలో గంజాయి కేసుల్లో పట్టుబడిన 8 మందిని బైండోవర్ చేసి, యువతపై ప్రత్యేక నిఘా పెట్టాం.

ప్రశ్న : ఇసుక అక్రమ రవాణాపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

జవాబు : ఆకేరు వాగు, పాలేరు వాగుల నుంచి ఇసుక అక్రమంగా రవాణా జరుగుతుంది. రెవెన్యూ, మైనింగ్, పోలీసుల బృందంతో దాడులు చేపడుతున్నాం.

ప్రశ్న : దొంగతనాల కట్టడికి తీసుకుంటున్న చర్యలు ఏమిటి.?

జవాబు : ఎక్కువగా బైక్‌లు, ఇండ్లలో బంగారు చోరీలు జరుగుతున్నాయి. వాటిని కట్టడిచేయడానికి ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటు చేస్తున్నాం.

- తొర్రూరు రూరల్ (ఆంధ్రజ్యోతి)

'అనుమతి లేని వెంచర్లపై చర్యలు'


వెంచర్‌లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో

తొర్రూరు, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వెంచర్లను ఏర్పాటు చేసుకుని లేఔట్‌లతో ప్లాట్‌ల విక్రయాలు చేపట్టాలని, ఎలాంటి అనుమతులు లేకుండా వెంచర్లలో ప్లాట్‌ల విక్రయాలు చేపడితే చర్యలుంటాయని అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో అన్నారు. గురువారం పట్టణంలోని కంటాయపాలెం రోడ్డు, సబ్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన వెంచర్‌లను పరిశీలించి సూచనలు చేశారు. అధికారులు తప్పనిసరిగా పర్యవేక్షించాలని, వెంచర్ల ఏర్పాటులో నిబంధనలు పాటించాలని ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పట్టణంలో వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారని, అధికారులు సమీక్షించాలన్నారు. ఎలాంటి అక్రమాలకు పాల్పడినా చర్యలు తీసుకోవాలన్నారు. మునిసిపల్ కమిషనర్ శాంతికుమార్, ఏఈ రంజిత్, సీసీ వినయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

తాత్సారం

(5వ పేజీ తరువాయి)

పరిశీలిస్తే రైతులు క్వింటాలుపై రూ.600 నుంచి రూ.700 వరకు నష్టపోతున్నారు.

వర్షాలతో పెరుగుతున్న తేమశాతం..

గత కొద్దిరోజులుగా వరుసగా జిల్లాలో వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. దాంతో పత్తిలో తేమశాతం పెరుగుతోంది. రైతులు చేలలో నుంచి పత్తితీసి, పూర్తిగా కల్లాలపై ఆరబెట్టకుండా, ఎండబెట్టకుండానే బస్తాల్లో నింపి నేరుగా మార్కెట్‌లకు తీసుకువస్తున్నారు. పత్తిలో 8 నుంచి 12 శాతం వరకు తేమశాతం ఉంటేనే సీసీఐ ఖరీదులు చేపడుతుంది. అయితే కొన్ని మండలాల్లో 24 నుంచి 34 శాతం వరకు, కొన్ని ప్రాంతాల్లో 40 శాతం వరకు కూడాతేమశాతం ఉంటుందని మార్కెట్, సీసీఐ అధికారులు చెబుతున్నారు. సీసీఐ పత్తి ఖరీదులు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నప్పటికి పత్తిలో తేమశాతం అధికంగా ఉండడంతో ఖరీదులు చేపట్టేందుకు వెనుకంజ వేస్తున్నారు. ఈ దీపావళి పండుగ వరకు వర్షాలు కురియకుండా ఎండలు కొడితేనే జిల్లాలో సీసీఐ పత్తి కొనుగోళ్లు ప్రారంభమయ్యే సూచనలు కన్పిస్తున్నాయి.

అమ్మకానికి మార్గదర్శకాలివే..

రైతులు పత్తి సీసీఐకి విక్రయించే సమయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మార్కెట్, సీసీఐ అధికారులు కోరుతున్నారు. బ్యాంక్ ఖాతా కూడా ఆధార్‌తో లింక్ చేసి ఉండాలని, సీసీఐ చెల్లింపులు ఆధార్ లింక్ చేసిన ఖాతాలకు మాత్రమే నగదు బదిలీ చేయడం జరుగుతుంది. పత్తిలో 8 నుంచి 12 శాతం తేమశాతం ఉండాలి. ఆధార్ సమాచారం డేటాబేస్‌తో సరిపోల్చాలి. బయోమెట్రిక్ ద్వార రైతుల వేలి ముద్రలు లేదా కన్నుగుడ్లను స్కానింగ్ చేస్తారు. ఆధార్‌తో మొబైల్ లింక్ చేసి ఉండి ఓటీపీ ద్వారా కొనుగోళ్లు చేపడుతారు. రైతులు పత్తి విక్రయించే సమయంలో ఆధార్‌కార్డు, పట్టాదారుపాస్‌పుస్తకం, ఆధార్ లింక్‌కు ఉన్న మొబైల్ నెంబర్‌ను తీసుకురావాల్సి ఉంటుంది.

క్రికెట్‌లో జాతీయస్థాయిలో గుర్తింపు తేవాలి

(5వ పేజీ తరువాయి)

మాట్లాడుతూ వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సహకారంతో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల జట్లు పాల్గొన్నాయని తెలిపారు. ఈ పోటీల్లో మహబూబాబాద్ జిల్లా జట్టు క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం సాధించి, రన్నరప్‌గా నిలపడం గర్వంగా ఉందన్నారు. జిల్లా సోసియేషన్ గౌర సలహాదారుడు విజయ్ సారథి, కోచ్ మెతుకు కుమార్, కెప్టెన్ చరిత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

ఇనుగుర్తి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఎరువులు పురుగుమందుల దుకాణాలను మహబూబాబాద్ డివిజన్ వ్యవసాయ సంచాలకులు(ఏడీఏ) అజ్మీరా శ్రీనివాసరావు గురువారం తనిఖీ చేశారు. వివిధ దుకాణాల్లోని స్టాక్ రిజిష్టర్లు, నిల్వలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం చిన్ననాగారంలో పత్తి, వరి, మిర్చి, పసుపు పంటలనమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి భూక్య మహేందర్, ఏఈవో వి.భాస్కర్ ఉన్నారు.

దళితులకు రూ.12 లక్షలు అందించాలి

నెల్లికుదురు సెంటర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ అంబేడ్కర్ సహాయ నిధి పథకం ద్వారా దళితులకు రూ.12 లక్షలను సత్వరమే అందించాలని ఎమ్మార్పీఎస్ దండోరా జాతీయ కార్యదర్శి కొండ్ర ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని జగ్జీవన్‌రాం, కేటీఆర్ కాలనీల్లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అంబేద్కర్ సహాయ నిధి పథకం ప్రవేశపెడుతాని చెప్పి దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారం చేపట్టి ఏడాది కావొస్తున్న అంబేడ్కర్ సహాయ నిధి పథకాన్ని అమలు చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే పథకాన్ని అమలు చేయాలని, లేనియేడల రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ధర్మారపు ఎలేందర్, పులి శ్రీను, దేవిటిపేందర్, సీహెచ్.రాధ, కుక్కల సుధ, సందీప్, ఎల్లమ్మ, సంధ్య, బాలరాజు, సాలమ్మ, యశ్వంత్, రాజేందర్, రాజు, ఎల్లయ్య, బాలకృష్ణ, కన్నయ్య, వీరయ్య, ప్రశాంత్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ దండోరా జాతీయ కార్యదర్శి కొండ్ర ఎల్లయ్య

సదర్ ఉత్సవాలను జయప్రదం చేయండి

టీపీసీసీ ఓబీసీ సెల్ రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ మేకల వీరన్నయాదవ్



మహబూబాబాద్‌టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 27న నిర్వహించనున్న సదర్ ఉత్సవాలకు యాదవ కులస్థులు జయప్రదం చేయాలని టీపీసీసీ ఓబీసీ సెల్ రాష్ట్ర వర్కింగ్ చైర్మన్, మానుకోట జిల్లా అధ్యక్షుడు మేకల వీరన్నయాదవ్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. హైదరాబాద్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రతి సంవత్సరం యాదవ కులస్థులు ప్రధాన ఉత్సవంగా సదర్ పండుగను జరుపుకుంటారని చెప్పారు. ఈ ఉత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, యూపీ మాజీ సీఎం అఖిలేష్‌యాదవ్, తేజస్వియాదవ్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్‌యాదవ్‌లతో పాటు రాష్ట్ర మంత్రులు హాజరవుతారని చెప్పారు. యాదవులు తరలివచ్చి సదర్ ఉత్సవాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

సామాజిక వర్గాల విశ్లేషణ సర్వేను చేపట్టాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 24 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టబోతున్న సామాజిక వర్గాల విశ్లేషణ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి నరసింహస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ బీసీ కమీషన్ ఆదేశాల మేరకు అన్ని సామాజిక వర్గాల విశ్లేషణను అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టేందుకు నవంబరు 2న హన్మకొండ కలెక్టరేట్‌లో సమావేశం ఉంటుందన్నారు. నవంబరు 2న హన్మకొండ కలెక్టరేట్‌లో నిర్వహించబోయే సమావేశానికి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులు, ప్రజాసంఘాలతో రాష్ట్ర బీసీ కమీషన్ చైర్మన్, సభ్యులు హాజరుకానున్నట్లు తెలిపారు. అన్నికులాల, సామాజిక వర్గాల, సర్వేపై వారి కులాలలో ఉన్నటువంటి సమస్యలు రాజకీయ, ఆర్థిక, సామాజిక అభ్యర్థనలు, వినతిపత్రాలు అందజేసేవారు, దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేయాలనుకునే వారు ఒక్కొక్కరు 6 సెట్లతో పాటు అఫిడవిట్ సమర్పించాలని సూచించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్సుమెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లోని నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట గురువారం సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం పట్ల నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. జ్యోతిబసు, ప్రవీణ్, వెంకటేష్, మహేష్, వినోద్, వినయ్, ప్రవళిక పాల్గొన్నారు.


తాగునీటి పైపులైన్‌ను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ మార్నేని శ్రీదేవిరఘు

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మునిసిపల్ 23వవార్డు పరిధి ఫైర్‌స్టేషన్ కాలనీలో 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించిన తాగునీటి పైపులైన్‌ను గురువారం స్థానిక కౌన్సిలర్ మార్నేని శ్రీదేవిరఘు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో 23వవార్డు పరిధిలోని బాబాగుట్ట, ఫైర్‌స్టేషన్, ఎన్జీవోస్, శ్రీరాంభద్రన్న, మిలటరీ కాలనీల్లో ప్రజలు తాగునీటి ఇబ్బందితో బాధపడేవారని చెప్పారు. అన్ని కాలనీలకు మంచినీటి పైపులైన్లు వేసి మిషన్‌భగీరథ ద్వారా తాగునీటినందించి సమస్యను పరిష్కరిచడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మామిడి దశరథం, ఎమ్డీ. ఇక్బాల్ ఉమేష్, ఐలయ్య, సలీం, బాలు, భద్రమ్మ, మల్లేష్, వెంకన్న, హేమ, సరిత, సంధ్య, కనకయ్య, యాకూబీ పాల్గొన్నారు.

పేదల పక్షాన నిలబడి పోరాడేది ఎర్రజెండా ఒక్కటే : సీపీఎం

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పేదల పక్షాన నిలబడి పోరాడేది ఎర్రజెండా ఒక్కటేనని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ సూర్నపు సోమయ్య అన్నారు. మహబూబాబాద్ ఎల్‌బీజీ నగర్ సీపీఎం శాఖ మహాసభను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన సోమయ్య మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ పాలకులు తాము అధికారంలోకి రాగానే బడాబాబులు స్విస్ బ్యాంకుల్లో దాచిన ధనాన్ని వెనక్కి తీసుకువస్తామని చెప్పి, నేటికి అమలు చేయలేదని ఆరోపించారు. నిత్యావసర సరుకులు ఆకాశన్నంటి పేదల ఆర్థిక భారం పడుతున్న ధరలను నియంత్రించడంలో కేంద్ర పాలకులు పూర్తిగా విఫలం చెందారని విమర్శించారు. ఈ మహాసభలో పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాంనాయక్, సమ్మెట రాజమౌళి, రావుల రాజు, అల్లి శ్రీనివాస్‌రెడ్డి, కుమ్మరికుంట్ల నాగన్న, తోట శ్రీనివాస్,ఎమ్డీ.రజాక్, లక్ష్మణ్, ఎస్కే. బేగం, సతీష్, నగేష్, వెంకన్న, బద్రి, లింగన్న సంపత్, బడుగుల లక్ష్మయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

డోర్నకల్ బంధం చెరువులో సర్వే

డోర్నకల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ శివారులోని బంధం చెరువులో గురువారం రెవెన్యూ, ఇరిగేషన్‌శాఖల అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించారు. ఓ వ్యక్తి బంధం చెరువు సమీపంలో కొనుగోలు చేసిన భూమిపై ఇటీవల కొందరు వ్యక్తులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ చెరువు శిఖాన్ని నిర్ధారించడానికి సర్వే చేయాలని ఆదేశించారు. సర్వేపై సదరు వ్యక్తి అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో హైకోర్టు ఆదేశాల మేరకు గురువారం సర్వే నిర్వహించినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అభిరామ్



బయ్యారం, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి) : లంబాడ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శిగా సంగ్యాతండాకు చెందిన ఇస్లావత్ అభిరామ్‌ను ఎన్నికున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మూడావత్ రాంబాల్‌నాయక్ గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన సంఘ ముఖ్యకార్యకర్తల సమావేశం అనంతరం రాష్ట్రంలోని అన్ని జిల్లాల బాధ్యులను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. కాగా, తన ఎంపికకు సహకరించిన కోట్యానాయక్, హరినాయక్, వెంకట్‌నాయక్, బానోత్ రామునాయక్, లక్ష్మణ్‌నాయక్ తదితరులకు అభిరామ్ కృతజ్ఞతలు తెలిపారు.

పోలీసు అమరుల త్యాగాలు వృథా కావు

మరిపెడ సీఐ రాజ్‌కుమార్‌గౌడ్


బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

మరిపెడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో అసులుబాసిన అమర పోలీసుల త్యాగాలు వృథా కావని మరిపెడ సీఐ ఎస్.రాజ్‌కుమార్‌గౌడ్ అన్నారు. గురువారం పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో భాగంగా మరిపెడలోని రాజీవ్‌గాంధీ సెంటర్ నుంచి కార్గిల్ సెంటర్ వరకు మరిపెడ పోలీస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించగా సీఐ ఆ ర్యాలీని ప్రారంభించి, మాట్లాడారు. ఎస్సైలు బోలగాని సతీశ్‌గౌడ్, సంతోశ్, ఝాన్సీ, నగేశ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి'

డోర్నకల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ధరలు పెరిగిపోతూ సామాన్య ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య అన్నారు. డోర్నకల్‌లోని జైన్ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, నాయకులు అల్వాల వీరయ్య, ఉప్పనపల్లి శ్రీనివాస్, శెట్టి వెంకన్న, బొమ్మన అశోక్‌కుమార్, దాసరి మల్లేశం, పుట్ట శ్రీనివాస్, జేవీఆర్, రాజేందర్, మురళి, వెంకటేశ్వర్లు, సరస్వతి, వెంకన్న, ప్రమీల పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను వినియోగించుకోవాలి

కురవి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్ రావుల రవిచంద్రారెడ్డి అన్నారు. కురవిలో లయన్స్‌క్లబ్, ధరణి అస్పత్రి ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అడిషనల్ క్యాబినెట్ సెక్రటరీ అనుమాండ్ల వెంకటేశ్వర్లు, సెక్రటరీ చాడ అశోక్‌రెడ్డి, సిదార్థ, కరుణాకర్‌రెడ్డి, నూతక్కి నర్సింహారావు, వద్దుల సురేందర్‌రెడ్డి, మేక దామోదర్‌రెడ్డి, సంగెం భరత్, డాక్టర్ ఆర్.శ్రీనివాస్, సీహెచ్.శ్రీనివాస్, దుడ్డెల వినోద్, ఆమెడ మల్లికార్జున్, కిన్నెర మల్లయ్య, ధైద భద్రయ్య, రఘు, మిర్యాల లక్ష్మయ్య పాల్గొన్నారు.

విద్యుత్ తీగలను సవరించాలి : డీఈ

కురవి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను సవరించాలని డీఈ విజయ్ సిబ్బందిని ఆదేశించారు. కురవి మండలంలోని రేకులతండ సహా పలు గ్రామాల్లో గురువారం రైతుల విద్యుత్ లైన్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులంతా విద్యుత్ మోటార్లకు కెపాసిటర్లు అమర్చుకోవాలని సూచించారు. రిపేర్‌లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను మార్చుకోవాలని సిబ్బంది సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ శారద, లైన్‌మెన్‌లు వెంకటేష్, జంపీరావు పాల్గొన్నారు.

సీఎం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి

ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి యాకయ్య


మాట్లాడుతున్న మిడతపల్లి యాకయ్య

కొత్తగూడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ సాక్షిగా ఎస్సీ రిజర్వేషన్‌లను అమలు చేస్తామని మాదిగలకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి మిడతపల్లి యాకయ్య డిమాండ్ చేశారు. కొత్తగూడలో గురువారం నిర్వహించిన సమావేశంలో యాకయ్య మాట్లాడారు. కాగా, మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు అన్ని మండల కేంద్రాలలో నవంబరు 4 నుంచి 14 వరకు మాదిగ ధర్మయుద్ధ దీక్షలు చేపట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు తీగల ప్రేమ్‌సాగర్, వీహెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు షైను సమ్మయ్య, నాయకులు బాల్య శంకర్, గుగ్గిళ్ల వెంకన్న, మెట్టుపల్లి ఈశ్వరయ్య, కేదాస్ ప్రసాద్, కొట్టె శ్రీనివాస్, తాళ్లపెల్లి ప్రభాకర్, చితం అనిల్, డేవిడ్‌పాల్, నర్సయ్య, సూరయ్య పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

- ఒక్కో కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం


అరుణ్‌కుమార్ కుటుంబానికి ఆర్థిక సాయం అందచేస్తున్న విద్యావేత్త కోరే వెంకన్న

గూడూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పొనుగోడుకు చెందిన మణికంఠ, అరుణ్‌కుమార్‌ల కుటుంబాలను అదే గ్రామానికి చెందిన విద్యావేత్త కోరె వెంకన్న గురువారం పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున ఇరువురి కుటుంబాలకు రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. వెంకన్న వెంట కోరె ఐలయ్య, కోరె రాంబాబు, కర్రె రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌కు కృషి చేయాలి

గూడూరు : విద్యార్థుల బంగారు భవిష్యత్ కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని పొనుగోడు పాఠశాల అభివృద్ధి దాత, ప్రముఖ విద్యావేత్త కోరె వెంకన్న అన్నారు. పొనుగోడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం నూతనంగా నియమితులైన ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం సురేష్, పూల్‌సింగ్, ఎస్ఎంసీ చైర్మన్లు జమీల్, వెంకన్న, ఉపాధ్యాయులు అర్జున్‌రావు, అశోక్, నరసింహరావు, రేణుక, కుమార్, నాగరాజు, మధు, రమేష్, శిరీష, ప్రియాంక, సుమలత, యాకలక్ష్మి, నగేష్ పాల్గొన్నారు.

'విద్య ప్రభుత్వ రంగంలోనే ఉండాలి'

కేసముద్రం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కేజీ నుంచి పీజీ వరకు విద్యాసంస్థలన్నీ ప్రభుత్వ రంగంలోనే ఉండాలని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కక్కెర్ల కృష్ణమూర్తి అన్నారు. కేసముద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటర్, ఇంజనీరింగ్ విద్య అంతా ప్రైవేటు కార్పొరేట్ సంస్థ చేతుల్లో ఉన్నాయన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో విద్యకు 11శాతం బడ్జెట్ కేటాయిస్తే తెలంగాణలో 7.31శాతానికి తగ్గించారని అన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు నాగయ్య, జిల్లా కార్యదర్శి భీముడు, జిల్లా కౌన్సిలర్ శ్రీనివాస్, బుచ్చిరెడ్డి, డూప్‌సింగ్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలి

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని డీఆర్‌డీవో పీడీ మధుసూదర్‌రాజు అన్నారు. మహబూబాబాద్ మండలం పర్వతగిరిలో నాటుకోడి పిల్లల యూనిట్‌ను, కుట్టుమిషన్ కేంద్రాన్ని, నర్సరీ, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ నాటుకోళ్లను పెంచివచ్చే ఆదాయంతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. నర్సరీల్లోని మొక్కలు ఎండిపోకుండా ఉండేందుకు ప్రతిరోజు నీటిని అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం తిలక్, ఏపీవో రమేష్‌రెడ్డి, ఈసీ రవి, సీసీ సుమలత, వీవోఏ సుధాకర్, నారాయణ, రాధిక, మంజుల పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచాలి

- డీఎంహెచ్‌వో మురళీధర్

గూడూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణప్రసవాల సంఖ్యను పెంచాలని డీఎంహెచ్‌వో డాక్టర్ మురళీధర్ అన్నారు. గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో సూపరిండెంట్ వీరన్న అధ్యక్షతన పీహెచ్‌సీల వైద్యాధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌వో మాట్లాడుతూ గూడూరు సీహెచ్‌సీకి అయోధ్యపురం, తీగలవేణి, కొత్తగూడ, గంగారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గర్భిణీలను గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి సాధారణ ప్రసవాలు జరిగే విధంగా చూడాలన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సారంగం, డాక్టర్ సుధీర్‌రెడ్డి, వైద్యాధికారులు యమున, రాంబాబు, శ్రీకాంత్, మురళి, శివ, జిల్లా మాస్‌మీడియా ఆఫీసర్ కొప్పు ప్రసాద్, సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలి

నెల్లికుదురు సెంటర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు అనారోగ్యాల బారిన పడకుండ వివిధ వైద్య పరీక్షలు నిర్వహించుకుని వైద్యుల సూచనల మేరకు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ప్రధాన ఆస్పత్రి సంపూర్ణ సురక్ష కేంద్రం మేనేజర్ రమేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ సమీపంలో వివిధ పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి వచ్చిన ప్రజలకు గురువారం ఆరోగ్యం పట్ల కళాకారులచే కళాజాత ద్వార అవగాహన కల్పించారు. గౌతమి, మానస, కళాజాత ప్రోగ్రాం బృందం, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

'నిధుల స్వాహా'పై ఇంటెలిజెన్స్‌ఆరా

- ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నర్సింహులపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : నర్సింహులపేట మేజర్ గ్రామ పంచాయతీలో పంచాయతీ నిధులు స్వాహా.. పనులు చేయకుండానే రూ.20 లక్షలు దుర్వినియోగం అనే కథనం ఆంధ్రజ్యోతి మినీలో గురువారం ప్రచురితమైన కథనానికి బాధిత ఇన్‌చార్జ్ అధికారులు, పాలకులు ఉలిక్కిపడ్డారు. ఈ నిధుల స్వాహాపై ఇంటెలిజెన్స్, ఎస్‌బీ అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. వారు ఇచ్చే నివేదిక ప్రకారం ఉన్నతాధికారులు విచారణకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది.

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి

ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

తొర్రూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న డీఏలు, బిల్లును విడుదల చేయాలని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం తొర్రూరులోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో, గురుకులాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వ హించి ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు పర్చాలన్నారు. రాష్ట్రప్రభుత్వం 5 విడతల డీఏ బకాయిలు, జీపీఎఫ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్, సరెండర్ లీవ్స్ బిల్లులను చెల్లించి కస్తూర్బా గురుకులాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులకు మినిమం బేసిక్ వర్తింపజేయాలని, ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు ప్రతీ సంవత్సరం 10శాతం వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, నాగమల్లయ్య, యాకయ్య చైతన్య, టీచర్లు పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా చందులాల్


చిన్నగూడూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : లంబాడ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్షుడిగా ఉగ్గంపల్లి గ్రామ శివారు దూమ్యా తండాకు చెందిన అంగోత్ చందులాల్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు ముడావత్ రాంబల్ తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తన ఎన్నికకు సహకరించిన ఆ సంఘ జాతీయ అధ్యక్షుడు బెల్లయ్యనాయక్, హరినాయక్, లక్ష్మణ్, వెంకట్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

మృతుల కుటుంబాలకు ఎర్రబెల్లి పరామర్శ

తొర్రూరు రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బీఆర్ఎస్ నాయకుల కుటుంబాలను గురువారం పరామర్శించారు. మండలంలోని హరిపిరాల బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దాసరి చంద్రమౌళి, నాంచారిమడూరు యూత్ అధ్యక్షుడు ధీకొండ శ్రీనివాస్ తల్లి మల్లమ్మ మరణించగా, ఇంటికి వెళ్లి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు సీతారాములు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ప్రదీప్ రెడ్డి, సోమేశ్వర్ రావు, మాజీ జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ యాదలక్ష్మీ, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్లు సూచించిన వారికి అవకాశం కల్పించాలి

- మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి


కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న మునిసిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల కమిటీల్లో వార్డు కౌన్సిలర్లు సూచించిన వ్యక్తులకు అవకాశం కల్పించాలని స్థానిక మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు గురువారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రాంమోహన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ గృహనిర్మాణ, ఎంపిక కమిటీల ఏర్పాటులో బీఆర్ఎస్ పార్టీ ప్రాతినిధ్య వార్డుల్లో కౌన్సిలర్లు సూచించిన వారిని కమిటీ సభ్యులుగా ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం బీఆర్ఎస్ కౌన్సిలర్లు తమ వార్డుల్లో సూచించిన పేర్ల జాబితాను కలెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ చిట్యాల జనార్ధన్ పాల్గొన్నారు.